# నవ్వరాదు

--నిడదవోలు మాలతి

★★★

''కమలిని సీరియస్. స్టార్ట్ ఇమిడియట్లీ''.  నా చేతిలో గులాబిరంగు కాయితం రెపరెపలాడుతోంది.
''నవ్వుతావేమిటే?'' అంది అమ్మ విసుగ్గా.
ఈమారు గట్టిగానే నవ్వేశాను. ''కమలిని సీరియస్సేమిటమ్మా! శ్రీరాముడి మళ్లీ పెళ్లిలాగ. అది సీరియస్ అయితే నేను నవ్వాల్సిందే మరి'' అన్నాను.

★★★

''ఎందుకే? ఏదో మునిగిపోతున్నట్టు, విశ్వసంసారం చేసి అలసిపోయిన ముసలి ముత్తైదువులాగ మొహం పెట్టుకుని కూచుంటావు ఎప్పుడూ. నన్ను చూసయినా నిండుగా నవ్వడం నేర్చుకోవే'' అంటూ హాయిగా నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ లోకంసర్కస్‌లో కామెడీక్వీన్లా చరించే కమలిని సీరియస్ అంటే నాకు నమ్మాలనిపించలేదు.

★★★

నేను ఫోర్తుఫారంలో ఉండగా నాన్నగారికి గుంటూరు ట్రాన్స్ఫరయింది. మా ఇంట్లోని క్రమశిక్షణవల్ల నయితేనేమి, స్కూల్లో ఆలస్యంగా చేరడంవల్ల కలిగిన ఇబ్బందులవల్ల నయితేనేమి, నేను ఎవరితోనూ కలవక-- ఇంట్లో వంచిన తల క్లాసులోనూ, క్లాసులో బయల్దేరితే ఇంట్లోనూగా ఉండేదాన్ని. క్లాసులో మేం మొత్తం 12మంది ఆడపిల్లలం ఉన్నా, 26 మంది మొగపిల్లలున్నా, అందరిలోనూ ప్రత్యేకంగా కనిపించేది కమలిని ఒక్కత్తే. చాలామటుకు ఆడపిల్లలు తన స్నేహంకోసం తన చుట్టూ చేరడం గమనించేనేమో, నేను మరీ దూరంగా తిరగడం మొదలుపెట్టాను.

నేను చేరిన మర్నాడే ఒక లేడీ టీచరు స్కూల్లో చేరింది. ఆవిడ మా క్లాసుకి రాగానే ప్లాట్‌ఫారంమీదకి ఎక్కబోతూ, హైహీలు అంచునపడ్డంతో జారి వెనక్కి పడింది. క్లాసంతా నవ్వినా, అందర్లోకీ బాగా తెలిసింది కమలిని నవ్వే. అందులోనూ చిత్రం ఏమిటంటే టీచరు తమాషాగా మొగ్గ వేసి, ఏం జరిగిందో గమనించేలోపున తన సీట్లో ఉంది.

కమలిని చప్పట్లు కొట్టి, ''శభాష్ మేడం. ఏ సర్కస్లోనూ ఇంత అద్భుతమైన ఫీటు చూపించి ఉండరు. బస్తీ మే సవాల్'' అంది గలగలా నవ్వుతూ.

మేం అందరం ఏం జరుగుతుందోనని భయంభయంగా చూస్తున్నాం. టీచరు మాత్రం కమలినివేపు తీక్షణంగా చూసి ఎటెండెన్సు తీసుకోడం మొదలెట్టారు. వెంటనే పాఠం మొదలెట్టకుండా, వెనకటి పాఠాల్లో ప్రశ్నలు వేస్తానని కమలినిని నిలబెట్టింది.

తేలికగా ఉండే ప్రశ్నలు, కఠినమైనవి, చిక్కుప్రశ్నలూ--ఆపైన చెప్పని పాఠాల్లోనూ అడిగింది. కమలిని కొన్నింటికి జవాబు చెప్పలేదు. అంతసేపూ నవ్వుతూనే ఉంది. టీచరు 'టేక్ యువర్ సీట్' అన్నప్పుడు -ఆవిడకి కలిగింది

కోపమో హర్షమో మాకు అప్పట్లో తెలీసేలేదు. ఆరోజు సాయంత్రం నేను పుస్తకాలు పట్టుకుని ముందు వెళ్లిపోతూంటే, వెనకనించి వచ్చి ఆపింది.

''చూడు. మాఇల్లు కూడా అటువేపే. నాతో రా. దగ్గిర తోవ చూపిస్తాను'' అంది.

నాకు ఆ పిల్ల పద్ధతి నచ్చలేదు. ''అక్కర్లేదు. నువ్వెళ్ళు'' అన్నాను చిరాగ్గా.

''సరే. నేనూ మెయిన్ రోడ్ మీంచే వస్తాలే, పద'' అంది.

దార్లో అడిగాను, ''క్లాసులో ఎందుకలా నవ్వుతావు? టీచర్లేం అనుకుంటారు?'' అని.

''నవ్వితే ఊపిరితిత్తులు బాగుపడతాయి. ఊపిరితిత్తులు బాగుంటే ఆరోగ్యం తెలుసా?'' అంది సీరియస్‌గా మొహం పెట్టి. ఆ సీరియస్‌నెస్ అంతా వేళాకోళం అని తెలుస్తూనే ఉంది. నేను మాటాడలేదు.

కమలిని పక్కున నవ్వేసింది.

''ఇప్పుడెందుకు నవ్వొచ్చింది?'' అన్నాను.

''అదే. నేను నవ్వితే నీకెందుకంత కోపం?''

ఏం సమాధానం చెప్పను?

దారిపొడుగునా అల్లరి చేస్తూనే ఉంది. మంచి స్పీడుగా వస్తున్న సైకిలుకి ఎదురుగా వెళ్లింది. నేను బెదిరిపోయి పక్కకి లాగితే మళ్లీ అదే నవ్వు.

''ఎందుకంత భయం. అతను నన్ను తప్పుకుంటాడని నాకు ముందే తెలుసు. ఎందుకో తెలుసా? అతను మా మేనత్తకొడుకే..''

కమలిని నిజం చెబుతూందో కట్టుకథలే చెబుతూందో నాకర్థం కాలేదు. నేను మౌనంగా తల వంచుకుని, కొనకళ్ల తన ముఖం పరీక్షించ సాగాను. ఓ మోస్తరు కోల మోహం, ఎత్తుగా ఉన్న చెంపల మీద కనీ కనిపించని చిన్న గుంట ఎల్లవేళలా తిష్ఠ వేసుకుని ఉండేట్టుంది. కళ్లూ, ముక్కూ విడివిడిగా చూస్తే అందం అని అనిపించకపోయినా, సదా ఉండే ఆ హాసరేఖల మూలంగా మంచి కళ వచ్చింది.

క్రమంగా మేం ఇద్దరం విడదీయరాని స్నేహం పెంచుకున్నాం. ఆకారవిశేషాల్లో కూడా కొంచెం పోలిక లుండడాన్నేమో కొత్త వాళ్లు మమ్మల్ని ఓతల్లిపిల్లలనుకొనేవారు. మొహం వాచేలా చీవాట్లేస్తే అమాయకంగా నవ్వేసే కమలిని అంటే టీచర్లకి కూడా అభిమానంగానే ఉండేది. ముఖ్యంగా తన షార్ప్ విట్ అందర్నీ ఆకర్షించిందనుకుంటాను. తన చుట్టూ చేరే పిల్లల గుంపుని చిరాగ్గా విదిలించుకు, నేను దూరంగా వెళ్లి కూచుంటే, తనొచ్చి నా దగ్గిర కూర్చునేది.

''అంత గుంపు నేను భరించలేను. నీ పటాలాన్నంతట్నీ వెంటబెట్టుకుని నామీద కెందుకూ దండెత్తుతావు?'' అంటాన్నేను.

''ఏం చేస్తాం. వాళ్లు నావెంటా, నేను నీవెంటా, నువ్వు మరొకరి వెంటా బడడం అనేది ఒక విషవలయం. సృష్ట్యాదినించీ వస్తున్న సినిమాకథ. అంత కారం ఒంటికి మంచిది కాదంటే వినవు. ఇదిగో, ఇలా కోపం తెచ్చుకుంటావు'' అంటూ విరగబడి నవ్వుతుంది.

''లే'' అని నేను పుస్తకం తీసుకు కూచుంటాను. నా చేతిలో పుస్తకం లాగేస్తుంది. పెన్ను దాచేస్తుంది. పెన్సిలుతో రాసుకుంటుంటే చేతిమీద కొడుతుంది. కాని నేనేమీ అన్లేను!

యస్సెల్సీ అయిపోయే వరకూ ఇద్దరం ఒకటిగా తిరిగాం. తను అతిగా నవ్వడం, నేను ఎక్కువగా సీరియస్‌గా

ఉండడం పైకి భిన్నంగా కనిపించినా, అంతర్గమైన ఒక భావతతి మమ్మల్ని ప్రాణమిత్రులుగా చేసిందనుకుంటాను. అందుకే యస్సెల్సీ అయిపోయిన తర్వాత కాలేజీలో చేరడానికి, దాన్ని అడక్కుండానే రెండు అప్లికేషను ఫారాలు తెప్పించాను.

అవి పట్టుకుని ఆ సాయంత్రం వాళ్లింటికి వెళ్లాను. ''నువ్వే చెప్పు. ఏ గ్రూపు తీసుకుందామో'' అని అడిగాను.

''దీంతో ఏరోప్లేను చెయ్యనా?'' అంది ఒక ఫారం తీసుకుని.

''అదేమిటి? నువ్వు కాలేజీలో చేరవూ?'' నిర్ఘాంతపోయేను.

''అదేమిటి? నువ్వు కాలేజీలో చేర్తావా?'' అంది నన్ను అనుకరిస్తూ.

నాలో ఒక తరంగంగా లేచిన - స్పష్టంగా చెప్పలేనిఒక భావం- అణిగిపోయిన తరవాత - అడిగాను, నాకిన్నాళ్లూ ఎందుకు చెప్పలేదని.

దానిచేతిలో పచ్చనిఫారం ఈలికలు వాలికలై విమానంగా మారిపోతోంది. అది నా బాధ గమనించనట్టు, ''పేపర్లో వేయించేసే పధ్నాలుగో తారీకు హిందూ చూళ్లేదూ? రెండో పేజీ, ఆరో కాలం, మీదినుంచి కిందికి వరసగా మూడో పేరా.''

''నేను ఏ గ్రూపు తీసుకుందాం అని ఆడిగితే పనస చదువుతావేం?''

''హెచ్. యస్. సి. డబుల్''

''అదేమిటి?'' నాకు చెప్పలేనంత కోపం వస్తోంది.

''నువ్వు అలా చిరాగ్గా మొహం పెడితే అస్సలు బావుండవని చాలామార్లు చెప్పేను. హెచ్చంటే హౌస్‌హోల్డూ -హస్బెండూ, యస్సంటే సొసైటీ- సెల్ఫ్ సర్వీసూ, సి అంటే చిల్డ్రనూ- కుకింగూ. అంచేత అది డబుల్. బావులే?''

''బావులేకేం'' అని కూడా అనలేక పోయాను.

''నువ్వు యంబీ చదివి, టీబీ స్పెషలైజు చేసి, ఆ వార్డులో పని చేస్తే, అసలు టీబీ అనేది లేకుండా పోతుంది'' అని సైన్సు టీచరు అన్నప్పుడు, ''నిజం మేడం'' అన్న కమలిని ఏదీ? నువ్వు లా చదివి ప్రాక్టీసు పెడితే మీ పోయిన ఆస్తులన్నీ తిరిగి వచ్చేస్తాయి'' అని మానాన్నగారు అంటే, ''మానాన్నగారు కూడా అదే అంటారండీ'' అన్న కమలిని?

భవిష్యత్తులో తానేదో పెద్ద చదువులు చదివి ఊడబొడిచేస్తానని కమలిని ఎప్పుడూ చెప్పలేదు. నిజానికి కమలిని రేపటిగురించి, నిన్నటి గురించి మాట్లాడగా విన్న వాళ్లు లేరు. కాని ప్రతి క్లాసులోనూ మంచిమార్కులు తెచ్చుకుంటూ, అందరు టీచర్ల అభిమానానికి పాత్రురాలయిన కమలిని ఇలా అర్థంతరంగా చదువు ఆపేస్తుందనుకోలేక పోయాను. కమలిని లేకుండా కాలేజీకి వెళ్లడం నేను ఊహించుకోలేక పోయాను. అందుకే ఆవెంటనే ఇంటికొచ్చేసి, మంచంమీద పడుకుని ఏడ్చేస్తే కాని మనసు స్థిమితపడలేదు.

''ఏమైందే'' అని అడిగిన అమ్మకి జవాబు మాత్రం చెప్పలేకపోయాను.

మరునాడు నాన్నగారు ''అప్లికేషను ఫారాలేవీ?'' అని అడిగితే, ''నేను కాలేజీలో చేరను'' అన్నాను జవాబుగా.

''ఏం?'' అన్నారు నాన్నగారు ఆశ్చర్యంగా.

నేను మాటాడలేదు. అమ్మని అడిగినట్టున్నారు. అమ్మ తనకేమీ తెలీదనీ, ముందురోజు నేను కమలినిదగ్గిరికి ఫారాలు తీసుకెళ్లాననీ చెబుతోంది.

ఆ సాయంత్రం నేను కమలిని ఇంటికి వెళ్తే, ''ఏమే, పిచ్చి మొహమా! చదివించండి మొర్రో అంటూ నెత్తీ నోరూ కొట్టుకుని ఏడ్చే ఆడపిల్లలు ఆంధ్రదేశం నిండా కోకొల్లలు. మీ నాన్నగారు చదివిస్తానంటే, నువ్వు

చదవనంటున్నావుట ఏగాలి సోకింది తల్లీ?'' అంది కమలిని.

''నీగాలే'' అన్నాను, సగం వేళాకోళంగానూ, సగం నిజంగానూ.

''బావుంది మీ వరస. రేప్పొద్దున్న పెళ్ళయితే కూడా ఇద్దరూ ఒక్కణ్ణే కట్టుకునేట్టే ఉందే'' - వాళ్ళమ్మ ,మా మాటలు విన్నారు కాబోలు సూటిగా విసిరారు.

కమలిని గల గలా నవ్వుతుంటే నాకు ఒళ్లు మండిపోయింది. కొంచెంసేపు ఊరుకుని, ''అయితే నీకు పెళ్లా?'' అన్నాను.

''చెప్పలే..హిందూ రెండో పేజీ, ఆరో కాలం..''

''ప్చ్. ఏమిటలా పనస చదువుతావు?''

''అది మాట్రిమోనియల్ కాలం. అందులో మూడో ప్రకటన నాకోసమే పడిందని మానాన్న గారూ, నీకోసం పడిందని నేనూ వాదించుకుంటున్నాం. దానిమీద మానాన్నగారు గెలుస్తారని మా అమ్మా, నేను గెలుస్తానని నువ్వు పందెం కాస్తున్నారుట'

''నువ్వెప్పుడూ ఇంతే. ఏదీ సరిగ్గా చెప్పవు''

''ఈ గుర్రప్పందేలకి జడ్జి అ పెళ్లికొడుకు రేపు వస్తున్నాడు''. ఈ వార్త దాన్లో ఎలాటి భావాలను రేపిందో నాకర్థం కాలేదు. అడిగి ప్రయోజనం కూడా లేదు.

అతను వచ్చి వెళ్లిపోయిం తరవాత, నేను వెళ్లి ''ఏమైందే?'' అనడిగితే అది విరగబడి నవ్వేసింది, ''కుర్రాడి జాతకం బాగుంది'' అంటూ.

''బాగుంటే, ఇంకేం మరి!'' అన్నాను.

''లక్కీ ఫెలో. తప్పించుకుపోయాడు.''

''నీ మెప్పుదల మండినట్టే ఉంది'' అంటున్నారు వాళ్లమ్మ వెనక నించి.

కాలేజీలో చేరనన్న నేను, బి.ఎ., యం.ఎ., మరొక యం.ఎ. కూడా చదవడం అయిపోయింది.

కమలినిని చూడ్డానికి పెళ్ళికొడుకులు వస్తున్నారు, పోతున్నారు. ఏ ఒక్కటీ స్థిరపడలేదు- చెప్పుకోదగినంత పెద్ద కారణం ఏమీ కనిపించకపోయినా. కమలిని మాత్రం విచారించినట్టు కనిపించలేదు. చదువూ, సంసారం, సంగీతం, సాహిత్యం-- ఏ వ్యాపకమూ లేని కమలిని, ఆరేళ్ళనాడు ఎలా చూశానో అలాగే నవ్వుతూ తుళ్లుతూ ఉన్న కమలినిని చూసి అనుకున్నాను - వరసగా వారం రోజులు శలవులొస్తే ఏంచెయ్యాలని కొట్టుకుపోయే యువతకి అది ఓ చక్కని జవాబు అని. నిజానికి ఈ ఆరేళ్లలో అది తల్చుకు ఏడవాల్సింది చాలా ఉంది. తల్లి పరమపదించింది. తండ్రి ఒక విధంగా సన్యాసం స్వీకరించి, సంసార బాధ్యతల్ని కొడుక్కీ, కోడలికీ అప్ప గించేశారు.

''కమలిని ఉంది కనక సరిపోతూంది గానీ ఇటు పిల్లల్ని చూసుకుంటూ, అటు వంటా, పనీ నా తరమా?'' అంటూ అవ్యాజానురాగం ఒలకబోస్తుంది వదినగారు.

''ఏం చూసుకునే అలా మురిసిపోతున్నావు?'' అని అడిగే గుండె నాకు లేకపోయింది.

నిర్లిప్తంగా ఉండిపోయిన నన్ను చూసి, ''నువ్వింకా ఎదగలేదే సరస్వతీ! చిన్నప్పుడు లోకం చూసి బెదిరిపోయి దిగులు పడ్డావనుకున్నాను. ఇప్పటికీ నీకర్థం కాలేదు, మనం ఏడ్చినా నవ్వినా ఒకటేనని. చూడు పొద్దున్నే అయిదు గంటలకి లేస్తానా? కాఫీనీళ్లు పడేసి, పిల్లలందరికీ స్నానాలు చేయించి, ముస్తాబు చేసేసరికి తొమ్మిదవుతుంది. మూడేళ్లకి పైబడిన బాచంతా స్కూళ్లకి పోతారు. మూడేళ్ల లోపు వాళ్లు ఒక బాచి- ముగ్గురున్నారులే- పాపం

మావదినే వాళ్ళని పట్టుక్కూచుంటుంది. నేను స్నానం చేసి వంట మొదలు పెట్టేసరికి పదిన్నర అవుతుంది. మధ్యాన్నం ఒక అరగంట సేపు నిద్ర పోతాను చూసుకో, ఏనుగుల చేత తొక్కించినా లేవను. అసలు నన్నెవరూ డిస్టర్బ్ చెయ్యరు కూడాను. చూడు, ఎంత ఆరోగ్యంగా ఉన్నానో.''

విస్లేక ''మళ్ళీ వస్తాన్లేవే'' అంటూ లేచాను. కమలిని నాచెయ్యి పట్టుకుని, ''సరసూ, ఆరు మాట్లు ఓడిపోయిన అలెగ్జాండరులా మొహం పెట్టుకుని ఇంటికి వెళ్తే, మీ అమ్మగారు నీకేదో మత్తుమందు పెట్టేశాననుకుని నామీద యుద్ధం ప్రకటించగలరు. ఒక్క మాటు అలా బాత్రూంలోకెళ్లి మొహం కడుక్కురా. కొంచెం కాఫీ ఇస్తాను. తాగి వెళ్దువు గాని. దీనికి కాఫీ ఇచ్చే అధికారం ఎక్కడిది అనుకుంటావేమో. ఆ పోర్టుఫోలియో అంతా నాదేలే. పైగా మా అన్నయ్యా, వదినా టెంపరరీగా టూరుకెళ్లారు''

''ఎక్కడికి?''

''మాటినీకేలే. జవాబులు చెప్పలేక చస్తున్నాను. పద. పద.''

వారంరోజుల తరవాత నేను ఉద్యోగం కోసం ఢిల్లీ వెళ్ళాను. పేరుకి ఊరు పెద్దదే అయినా, ఆదాయం అంకెల్లో ఘనంగానే కనిపించినా, గుంటూరు తరుచూ రావడానికి తగినంత సొమ్ము కాకపోవడం చేతా, ఉద్యోగంలో ఇబ్బందులవల్లా, దాని పెళ్లికి దూరంనించే దీవించి ఊరుకోవలసి వచ్చింది. నేను బాధ పడుతూ రాసిన పది పేజీల ఉత్తరానికి అది ఒక్క ముక్కలో సమాధానం ఇచ్చింది, ''పది పైసలు ఓవర్‌బేరింగు తగిలింది. సంపాదించుకునే వాళ్లకి దరిద్రం ఎక్కువనుకుంటాను'' అని. ఆరాత్రి కమలిని కలలో నవ్వుతూ కనిపించింది. దాని కష్టాలు గట్టెక్కాయి అనుకున్నాను. తనకు తానై అది ఒక్కరోజూ కష్టం అనుకోకపోయినా.

★★★

నాలుగేళ్ల తరవాత గుంటూరు వెళ్లి, వెతుక్కుని, కమలిని వాళ్ల యింటికి వెళ్లాను. వాళ్ల వదినగారు ముందు నన్ను గుర్తించలేదు. గోత్ర నామాలు మనవి చేసుకున్నాక కమలిని ఆదివారం వస్తుందని చెప్పారు.

ఎదురు చూసిన ఆదివారం రాగానే, ఎగిరిపడుతున్న గుండెల్తో, ఆనాటి కమలిని కోసం పరుగెత్తుకు వెళ్లిన నేను, అరుగుమీద నిలబడిన కమలినిని చూసి ఆరడుగుల దూరంలో నిర్ఘాంతపడి నిల్చుండిపోయాను. నిన్న మొన్నటి వరకు అఖండజ్యోతిలా వెలిగిన మొహం వన్నె తరిగింది. మనిషి బాగా చిక్కిపోయినట్టు కనిపిస్తోంది.

''రా. రా. నీకోసమే చూస్తున్నాను. మొన్న వచ్చి వెళ్లావుట కదా. అలా చిక్కిపోయావేమిటె? సొంత సంపాదన కదూ, ఖర్చయిపోతుందేమోననా? దాస్తున్నావా?'' ఈమాటలు మునుపటి కమలినివి కావు. ఆనవ్వులో మునుపటి జీవం లేదు.

తను పరిచిన చాపమీద కూచుంటూ అన్నాను, ''నువ్వేం వెక్కిరించక్కర్లేదు. నేను బాగానే ఒళ్లు చేశానని నాకు తెలుసు''.

''నీకోపం మాత్రం తగ్గలేదు కదా'' అంది నవ్వి.

''పోన్లే. ఏమిటి విశేషాలు చెప్పు.''

''ఏముంది, ఆరో నెల'' మళ్లీ నవ్వింది. కావాలని తెచ్చిపెట్టుకున్నట్టుంది. చావుదెబ్బ తినబోతున్నానని తెలిసి, గుండెబలం సంతరించుకున్న లేడిపిల్లలా ఉంది అది. ఓ గంటసేపు కూచున్నాను. కమలిని అంతసేపూ ఏదో వాగుతూనే ఉంది. కాని అది స్వేచ్ఛగా లేదు. అందులో ప్రయత్నం కనిపిస్తోంది. అది అలిసిపోయినట్టు కనిపిస్తుంటే

అడిగాను, ''నువ్వేం అనుకోనూ అంటే ఒకటి అడుగుతాను''.

''అడగవే, సరసూ! అడుగు. నేనేం అనుకుంటానే పిచ్చిమొహమా! నేనేదో అనుకుంటానని నువ్వు అనుకుంటున్నందుకు అనుకోవాలిసొస్తోంది గానీ, అడుగు''

ఒక్కక్షణం దానిమొహంలోకి నిశితంగా చూసి ప్రశ్నించాను, ''నీ సంసారం ఎలా ఉంది?''

క్షణంలో సగంసేపు దానిమొహంలో విషాదం కనిపించినట్టు అనిపించింది. నా జీవితంలో దానిముఖంలో విషాదం ప్రతిఫలించినట్టు గమనించింది ఆ ఒక్కక్షణమే!

''నా సంసారానికేం? దివ్యం. నిజంగా సరసూ, రసవత్తరంగా ఉంది. మనుషుల్ని స్టడీ చెయ్యడానికి నాకింత స్కోపు దొరుకుతుందని నేను కల్లో కూడా అనుకోలేదే. మామిడిపళ్లు తింటారనీ, బియ్యం అన్నం వండుకుంటారనీ తెలీని జాతి ఉందని ఆ ఊరికి వెళ్లిం తరవాతే తెలిసింది నాకు. వరన్నం తింటే నజ్జు చేస్తుందిట. మామిడిపండు తింటే జబ్బు చేస్తుందిట. దానిమీద ఎంతైనా రిసెర్చి చెయ్యొచ్చు కదూ...'' కమలిని నవ్వుతూనే ఉంది. ''మా మొదటివాడు పుట్టినప్పుడు - ఆశ్చర్యపోకు- ఇది నాలుగో ఛాన్సు - ముందువాళ్లు ఇద్దరూ పుట్టీ చచ్చిపోయారు. మూడోవాడు అంతదాకా కూడా రాలేదు. మొదటివాడు - ఏడాదిన్నర వెధవ - మూసిన కన్ను తెరవకుండా మంచంలో పడి కొట్టుకుంటుంటే, వాడి గొంతుకులో ఇన్ని మందునీళ్లు పోయించకుండా, శొంఠికషాయం, సున్నపు పట్టెడలూ వేసి, వాడు చస్తే నేను గుండెలు బాదుకుని ఏడవలేదని నన్ను వెర్రిదానికింద జమ కట్టేరు. అందుకే రెండో పిల్లణ్ణి నేనే చంపేశాను.''

''కమలీ!''

కమలిని నవ్వింది. ఈ మారెందుకో నాకు పూర్వపు నవ్వు కనిపించింది. ''భయపడకు సరస్వతీ! ఊరికే అన్నాను. కుర్రాడు మాత్రం పనసపండులా పుట్టేడు. బతికుంటే ఇప్పుడు నాలుగో ఏడన్న మాట. కాని బతికిలేడు.''

''నేను వెళ్లొస్తాను, కమలినీ!''

''ఉంటావా కొన్నాళ్లు?''

''నెల రోజులు శలవు పెట్టి వచ్చాను. మధ్యలో ఒకమారు విశాఖపట్నం వెళ్లాలి. మా అన్నయ్యా, వదినా రమ్మని రాస్తున్నారు'' అనేసి వచ్చేశాను. దార్లో అనుకున్నాను ''కమలినీ, నువ్వొక అద్భుతమైన వ్యక్తివి. నిన్ను అనుకరించడానికీ, సానుభూతి చూపడానికీ కూడా నేను అంత ఎత్తుకి ఎగరలేను'' అని.

★★★

విశాఖపట్నం వెళ్లిన వారం రోజులకి టెలిగ్రాం వచ్చింది. ''స్టార్ట్ ఇమిడియట్లీ'' అని వాళ్ల నాన్నగారిచ్చారు. కమలినే ఇవ్వమందిట.

నేను చూచేసరికి మంచానికి బల్లిలా అంటుకుపోయి ఉంది. ఒక్క పదిరోజుల్లో మనిషి చిక్కి శల్య మయిపోవచ్చునని నాకు అంతవరకూ తెలీదు. మంచందండెం మీద కూచుని, పుల్లలా ఉన్న దాని చేతిని నాచేతిలోకి తీసుకుంటుంటే దుఃఖం ఆపుకోలేక పోయాను.

''ఎందుకే ఏడుస్తావు? నువ్వు కూడా వాళ్లలాగే ఏడుస్తావనా నిన్ను ప్రత్యేకంగా పిలిపించింది. లోకంలో ఏడ్చేవాళ్లూ, ఏడవడానికి కారణాలూ బోలెడు. అసలు నిన్నెందుకు పిలిపించేనో తెలుసా? ఇప్పుడు యమ ధర్మరాజు వస్తాడు

కదా, డాక్టరు కాదులే''

దానినోరు మూయడానికి నేను చేసిన యత్నాలేమీ ఫలించలేదు.

''యమధర్మ రాజు వస్తే ఎలాగ పోల్చుకోడమా అని. యన్టీ రామారావులాగ ఉంటాడా, యస్వీ రంగారావులాగ ఉంటాడా, చెప్పు. ఎవరు పడితే వారి వెనక పోలేను చూడూ..'' దాని నవ్వు భయంకరంగా వినిపించింది.

''అలా నవ్వకు కమలీ'' అన్నాను.

''నువ్వు కూడా నవ్వరాదనే అంటావా'' - 'దౌ టూ బ్రూటస్' అన్న సీజరు ధ్వనించాడు ఆ స్వరంలో.

''అది కాదు కమలీ, నువ్వు తప్పకుండా కోలుకుంటావు. నువ్వు చావు గురించి మాటాడి నన్ను భయపెట్టేయకు'' అన్నాను కడుపులో బాధ నరాలు తోడేస్తూంటే.

''నువ్వు కూడా, నన్ను చిన్నప్పట్నుంచీ తెలిసిన నువ్వు కూడా 'నవ్వరాదు' అనే అంటావు కదూ'' కమలిని మొహం గోడవేపుకి తిప్పుకుంది.

''ఇటు చూడు, కమలీ, అలా అనను కమలీ, ఇటు చూడవూ'' అని నేను ఎంత ఏడ్చినా కమలిని మళ్లీ చూడలేదు. నవ్వు ఆరోగ్యమని అందర్నీ నవ్విస్తూ, తాను నవ్వుతూ పాతికేళ్లకే నూరేళ్లు నింపుకుని వెళ్లిపోయిన కమలినిని ఎవరూ నవ్వించలేదు. దాని ఛాన్సు వచ్చేసరికి 'నవ్వరాద'ని ఆంక్ష పెట్టిన వాళ్లే కానిదాన్ని నవ్వించిన వాళ్లు లేకపోయారు…

అందుకే నేను నవ్వలేను.

★★★

(జయశ్రీ సంక్రాంతి ప్రత్యేక సంచిక 1968-లో ప్రచురితం)